**"నీకు ఒకసారి చెపితే అర్థం కాదా? ఎందుకు ప్రేమిస్తున్నానంటూ నా వెంటపడి వేధిస్తున్నావ్? నా మానాన నన్ను మనశ్శాంతిగా బ్రతకనియ్యవా? నేను ఇప్పుడు మళ్ళీ కాదంటున్నాగా! ఇంకేంచేస్తావ్? కత్తితో పొడుస్తావా? ముఖాన యాసిడ్ పోస్తావా? అలాంటివేగా మీరు చెయ్యగలిగింది? కమాన్! ఏం చేస్తావో చెయ్! నీ కసి నా సమస్యలు అన్నీ తీరిపోతాయ్!"**

కథ

# మనసు పిలిచె

**భీమరాజు వెంకటరమణ**

కళ్యాణి మాటలు కాలేజీ కాంపస్‌లో మారుమ్రోగిపోయాయి. ఆ పరిసరాల్లో వెళుతున్న విద్యార్థులు ఎక్కడివారక్కడ విగ్రహాలైపోయారు. అందరి చూపు శ్రీరాం వైపు మళ్ళింది. కానీ అతని ముఖంలో ఏ విధమైన హావభావాలూ లేవు. స్తబ్ధుగా ఉన్నాడు.

కళ్యాణి పరుగున వెళ్ళి దూరంగ ఉన్న చెట్టు క్రింద కూర్చొని చేతులలో ముఖం దాచుకొని ఏడుస్తోంది. విద్యార్థులు ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు. కొంతమంది కళ్యాణి స్నేహితురాళ్ళు మాత్రం ఆమె వద్దకు చేరుకున్నారు.

అందులో ఒకామె "కళ్యాణి! ఏమైంది? మాకేమీ అర్థం కావడం లేదు. ఏమిటీ ఆవేశం? శ్రీరాం నిన్ను అల్లరి చెయ్యడమేమిటి? అతను కాలేజీలోకెల్లా తెలివైన స్టూడెంట్! మంచి నడవడి కలవాడు. అతన్ని పట్టుకొని అంతంత మాటలు అంటున్నావేమిటి? అసలేమి జరిగింది?" అడిగింది.

స్నేహితురాలి ప్రశ్నలకు కళ్యాణి నుండి ఏ సమాధానమూ రాలేదు. మెల్లగా తల పైకెత్తి చూసి "ప్లీజ్! నన్నేమీ అడగకండి! నన్ను ఒంటరిగా వదిలెయ్యండి" అన్నది.

అందరూ ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు. చేసేది లేక చిన్నగా అక్కడి నుండి వెళ్ళిపోయారు.

దాదాపు గంట సమయం గడిచింది. చీకటి పడుతోంది. కళ్యాణి కాస్త తేరుకున్నది. కానీ జరిగిన సంఘటన మళ్ళీ మళ్ళీ మనసులో మెదులుతూనే ఉన్నది. "అవును! శ్రీరాంను అంతగా కోప్పడవలసిన అవసరం లేదు. అతనేమీ అసభ్యంగా ప్రవర్తించలేదు. ప్రపోజ్ చేసాడు. సరళంగానే ఖదులిచ్చి ఉండొచ్చు. కానీ నేనెందుకు అంతగా ఆవేశపడ్డాను? నా నియంత్రణలో నేను లేనా? ఎలా ఉంటాను?" తన పరిస్థితి మనసులో మెదిలింది. దుఃఖం పొంగుకొస్తున్నది. మళ్ళీ భోరున ఏడుస్తున్నది.

ఎవరిదో చెయ్యి మెత్తగా ఆమె భుజాన్ని తాకింది. ఉలిక్కిపడి తలెత్తి చూసింది. గంభీర వదనంతో శ్రీరాం నిలుచుని ఉన్నాడు.

ఈసారి ఆమెకు కోపం రాలేదు. "సారీ శ్రీరాం! నీతో నలుగురిలో అవమానంగా మాట్లాడాను. ఎందుకనో నా కంట్రోలులో నేను లేను" అన్నది.

"నేనేమీ బాధపడలేదు" అన్నాడతను ప్రశాంతంగా.

అతనివైపు ఆశ్చర్యంగా చూసింది. "ఏమిటి శ్రీరాం! నాకంతా అయోమయంగా ఉంది. నీలాంటి తెలివిగల విద్యార్థి ఇలాంటి విషయాల్లో పడి భవిష్యత్తు నాశనం చేసుకోవచ్చా? నువ్వంటే నాకు చాలా మంచి అభిప్రాయం ఉంది. కానీ నా గురించి నీకేమి తెలుసు? నేను కాదన్నా ఎందుకు వెంట పడుతున్నావు? కళ్ళు తుడుచుకుంటూ అడిగింది.

"నేను చెప్పినా వినే స్థితిలో ఇప్పుడు నువ్వున్నావా?" అడిగాడతను.

"ఫరవాలేదు చెప్పు! ఈ విషయం ఇవాళే తేలిపోతే బావుంటుంది".

కళ్యాణీ! కాలేజీలో మొట్టమొదటిసారిగా నిన్ను చూసినప్పటినుంచీ అనుకోకుండా నిన్ను గమనిస్తూ వచ్చాను. మొదట నీ హావభావాలు నువ్వు మాట్లాడే తీరు నన్ను ఆకట్టుకున్నాయి. అప్పటినుంచీ నీ వ్యక్తిత్వాన్ని గమనిస్తూ వచ్చాను, నీపై ఇష్టం పెరుగుతూ వచ్చింది. ఆలస్యం చేస్తే ఎక్కడ దక్కకుండా పోతావోనని అడిగేసాను.

"నేను కాదన్నాను" అవునా?

అతను తలూపాడు.

"అయితే మళ్ళీ ఎందుకు అడుగుతున్నావ్?"ఆశ్చర్యంగా అడిగిందామె.

అతను మౌనంగా ఉన్నాడు.

"చూడు శ్రీరాం! నిజానికి నువ్వంటే నాకెంతో అభిమానం గౌరవం కూడా. కారణం నువ్వు మంచి స్టూడెంట్‌వి. మంచి నడవడి కలవాడివి. కాలేజీకి మంచిపేరు తెచ్చే విద్యార్థిగా నిన్ను లెక్చరర్స్ పొగుడుతుంటే నాకెంతో సంతోషంగా అనిపించేది. నీలాంటివాడు అడిగితే ఏ అమ్మాయీ కాదనలేదు" అంటూ మాట్లాడటం ఒక్కసారిగా ఆపింది.


"ఊ! చెప్పు! ఎందుకు మాట్లాడటం ఆపేసావ్? నువ్వెందుకు నన్ను కాదన్నావో చెప్పు".

ఆమె ముఖంలో రంగులు మారాయి. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "నాకా అదృష్టం లేదు అంతే! అంతకన్నా ఇంకేమీ అడగకు ప్లీజ్".

"నో! ఇవాళ ఈ విషయం తేలిపోవాలన్నావుగా? చెప్పి తీరాల్సిందే!" శ్రీరాం ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

ఆమె నోట మాట రాలేదు. భోరున కుమిలి కుమిలి రోదిస్తోంది. ప్రక్కగా కూర్చొని ఆమె ముఖాన్ని తన చేతులతో పైకెత్తుతూ "నాకంతా తెలుసు" అన్నాడు శ్రీరాం.

ఆమె ముఖం ప్రశ్నార్థకంగా మారిపోయింది. "ఏమి తెలుసు నీకు? అసలేమి తెలుసు?" అన్నది ఆవేశంగా.



"నీకు ట్రీట్మెంట్ ఇస్తున్న డాక్టర్ హార్షవర్ధన్ మా నాన్నగారే" అన్నాడు.

ఆమె నెత్తిన పిడుగు పడ్డట్లయింది. ఒళ్ళంతా కంపించిపోయింది. చటుక్కున అతన్ని తోసేసి ప్రక్కగా జరిగి వణికిపోతూ కూర్చుని దిగ్భ్రాంతిగా చూస్తున్నది. అతను ఆమె దగ్గరకు రాబోయాడు.

"నో! నా దగ్గరకు రావద్దు" అరచిందామె. అతను మెల్లగా దగ్గరకు వచ్చి ఆమె చేతులు పట్టుకున్నాడు.

"నన్ను చూస్తే అసహ్యము భయము కలగడం లేదా" బెదురుగా చూస్తూ అడిగింది.

"లేదు".

"నిజంగా నేను హెచ్.ఐ.వి పాజిటివ్ అని తెలిసే మాట్లాడుతున్నావా?"

అతను తాపీగా తలూపాడు.

ఆమె ఆశ్చర్యానికి అంతులేదు. తమాయించుకోవడానికి కొంత సమయం పట్టింది. శ్రీరాం ఆమెతో నిశ్చలమైన వదనంతో చెప్పనారంభించాడు.

"కళ్యాణి! అప్పట్లో నిన్ను ఇష్టపడినమాట నిజం.కానీ నువ్వు కాదన్న తరువాత నీ నిర్ణయాన్ని గౌరవించాను. కానీ నాలో నీపై చెక్కుచెదరని అభిమానం కొనసాగుతూనే ఉన్నది. ఈ మధ్య ఏదో పని మీద మా నాన్నగారి హాస్పిటల్‌కు వెళ్ళాను. అప్పుడు నువ్వు ఆయన ఛాంబర్ నుండి వెళుతుండగా చూసి ఆశ్చర్యపడ్డాను. టేబుల్‌పై ఉన్న నీ ట్రీట్మెంట్ ఫైల్ చూసి నివ్వెరపోయాను. ఒక్కసారి లోకమంతా శూన్యంగా అనిపించింది. నా బాధకు అంతులేదు. ఒకసారి నీకు ఆరోగ్యం బాగా లేక ఏదో హాస్పటల్‌కి వెళితే అక్కడ వాళ్ళు నిర్లక్ష్యంగా వాడిన సిరంజి ద్వారా నీకీ వ్యాధి సోకిందని తెలుసుకున్నాను.

ఆ రోజు నుండి నీ గురించి ఆలోచనే నా లోకమైపోయింది. నీకు నేనున్నానని చెప్పాలనింపించింది. నీకు అండగా నిలవాలనిపించింది. నిన్ను రక్షించుకోవాలనే తపనతో మా నాన్నగారితో పదేపదే నీ వైద్యం గురించి అడుగుతుండటంతో అమ్మా నాన్నలు నా మనసులోని విషయాన్ని పసిగట్టారు. నన్ను అర్థం చేసుకున్నారు. నాకు రెట్టింపు బలం వచ్చింది. అదే మళ్ళీ నిన్ను ఈరోజు అడగటానికి కారణమయింది" అన్నాడు.

ఆమెకు జరుగుతున్నది కలో నిజమో అర్థం కావడం లేదు. "శ్రీరాం! నువ్వు మాట్లాడుతున్నది నమ్మశక్యంగా లేదు. నన్ను ప్రేమించి ఏమి

**రెండు నెలలుగా మా అమ్మ గుండె జబ్బు బారిన పడింది. చేయవలసిన వైద్యాలన్నీ చేసి డాక్టర్లు చేతులెత్తేసారు. ప్రస్తుతం ఆమె రోజులు లెక్కపెడుతున్నది. నన్ను ఒక ఇంటికి కోడలుగా పంపాలనే ఆతృత రోజురోజుకూ ఎక్కువగా కనవరుస్తున్నది. కానీ ఆమెకేం తెలుసు? పెళ్లి చేసుకునే అర్హత పోగొట్టుకున్నానని?**

చేస్తావ్? నా జీవితం ఎప్పటివరకు కొనసాగుతుందో నాకంటే నీకంటే మీ నాన్నగారికే బాగా తెలుసు. అలాంటిది ఆయన అడ్డు చెప్పకపోవడమేమిటి? నన్ను సినిమాలకు షికార్లకు తిప్పుతూ నేను సరదాగా ఉండేట్లు చూడటమే ప్రేమనుకున్నావా? ఆ తరువాత పర్యవసానాలు ఎలా ఉంటాయో ఊహించగలవా? నా వల్ల నలుగురిలో అభాసుపాలు కావడమే కాకుండా నీ జీవితాన్ని నాశనం చేసుకుందామనుకుంటున్నావా? అందుకు నేనెంతమాత్రం ఒప్పుకోను" అన్నదామె కాస్త ఆవేశంగా.

"కళ్యాణి! నీ తప్పు లేకుండా నీకీ వ్యాధి సోకడం నన్ను కదిలించి వేసింది. నీ కోసం నేను చెయ్యగలిగింది చెయ్యాలి! దాని పర్యవసానం ఏదైనా నేను బెదిరిపోను. నీవనుకున్నట్లు నా జీవితం నీ వల్ల నాశనం అవుతుందనేమాట అర్థం లేనిది. మనిషిగా నాకొక మనసుంది, అది నిన్ను ఇష్టపడింది, ఇప్పుడు నీకు కష్టం వచ్చిందని అది మారిపోతే నేను మనసు మానవత్వమూ రెండూ లేనివాడినయినట్లే!"

"శ్రీరాం! నీ ప్రేమలో అమాయకత్వంతో పాటు నిజాయితీ కూడా నాకు కనపడుతున్నది. ఇదే మామూలు పరిస్థితులలో అయితే నేను గొప్ప అదృష్టవంతురాలినే. కానీ ఆ అదృష్టాన్ని ఈ వ్యాధి మింగేసింది. అంతేకాక నీకు నా విషయాలు చాలా తెలియవు. ఈ రోజు నీ మీద అంతగా మండి పడ్డానంటే కారణం నా మనసు పూర్తిగా నిస్పృహకు లోనై ఉండటం, ఈ వ్యాధిని మించిన దిగులు వేదన మరొకటి అనుక్షణం అనుభవిస్తున్నాను... మా అమ్మ గురించి. మా నాన్నగారు చనిపోయి ఆరు సంవత్సరాలయింది. అప్పటినుండి ఎన్నో అవస్థలు పడుతూ మా అమ్మ నన్ను చదివిస్తూ వచ్చింది. నన్ను కనీసం డిగ్రీ అయినా చదివించాలని ఆమె పట్టుదల. మాకున్న ఒకే ఒక ఆధారం చిన్న పెంకుటిల్లు, అందులోనూ సగభాగం ఖర్చులకని అమ్మేసింది. ఇక మిగిలిన సగమూ అమ్మేసి ఈ సంవత్సరం కాలేజీ చదువు అయిపోయాక నా పెళ్ళి చేసెయ్యాలని ఆమె దృఢ సంకల్పం.

కానీ విధి మా కుటుంబం మొత్తంపై పగ పట్టినట్లుంది. రెండు నెలలుగా మా అమ్మ గుండె జబ్బు బారిన పడింది. చేయవలసిన వైద్యాలన్నీ చేసి డాక్టర్లు చేతులెత్తేసారు. ప్రస్తుతం ఆమె రోజులు లెక్కపెడుతున్నది. నన్ను ఒక ఇంటికి కోడలుగా పంపాలనే ఆతృత రోజురోజుకూ ఎక్కువగా కనవరుస్తున్నది. కానీ ఆమెకేం తెలుసు? పెళ్లి చేసుకునే అర్హత పోగొట్టుకున్నానని?, అసలు ఆమెకంటే ముందు నేనే ఈ లోకాన్ని విడిచి వెళ్ళే అవకాశం కూడా ఉందని? శ్రీరాం! ప్రస్తుతం నాకున్నది ఒకే ఒక కోరిక! అదేమిటో తెలుసా? నాకంటే ముందు మా అమ్మ చనిపోవాలి" అన్నది పెద్దగా నవ్వుతూ, "ప్రపంచంలో ఏ కూతురూ కోరని కోరిక!" ఇంకా పెద్దగా నవ్వుతూ ఆ నవ్వులో ఏడుపు దాచుకుంటూ. శ్రీరాం మనసు కదలిపోయింది. చెమర్చిన కళ్ళతో ఆమెను చూస్తున్నాడు.

"చెప్పు శ్రీరాం! అప్పుడు కాదు ఇప్పుడు నిజంగా నీకు భయమేస్తున్నది కదూ! నీ ప్రేమ నిరుపయోగమవుతుందని అర్థమయింది కదూ! నువ్వు వీలైతే ఒక్క సహాయం చెయ్యి!మా తల్లీ కూతుళ్ళని ఒక్కసారిగా



తీసుకెళ్ళమని ఆ భగవంతుణ్ణి ప్రార్థించు".

కళ్యాణి సొమ్మసిల్లే పరిస్థితిలో ఉంది. ఆమె కన్నీరు తుడిచి ఆమె చేతులను తన చేతుల్లోకి తీసుకున్నాడు శ్రీరాం.

"కళ్యాణీ! ఈ విషయాలన్నీ ఇంతకుముందే నేను తెలుసుకున్నాను. ఇప్పుడు నీతో మాట్లాడిన తరువాత నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకున్న నా నిర్ణయం సముచితమైనదని భావిస్తున్నాను" అన్నాడు ప్రశాంత వదనంతో. కళ్యాణి ఆశ్చర్యానికి అంతులేదు, నోట మాట రావడం లేదు, అతని వైపు చూస్తూ ఉన్నది.

"పెళ్ళంటే శారీరక సంబంధం మాత్రమేనా? కోరుకున్న వ్యక్తి బాధ్యత తీసుకోవడం కూడా కాదా? నీతో నేనుండాలి. నీ అనారోగ్యం గురించిన ఆలోచనలు నీకు రాకుండా చెయ్యాలి. నీకు నలుగురితో కలిసి జీవించే హక్కు ఉందని ఋజువు చెయ్యాలి. నిన్ను అన్నివిధాలా ఆనందంగా ఉంచాలి! అందులో భాగంగా మీ అమ్మ కూడా ఉందని నాకు తెలుసు. ఆమె చివరి కోరిక తీరే విధంగా మనం దంపతులుగా ఆమె ముందు నిలుద్దాం".

అతని మాటలకు కళ్యాణి తనువు పులకించింది, గుండె బరువు ఒక్కసారిగా తీరిపోయింది. నూతన ఉత్తేజం కలుగుతోంది. మరణ భయం వీడిపోయింది. మనసు ఆనంద డోలికల్లో తేలిపోతోంది. కారుతున్న కన్నీళ్ళు ఆనంద భాష్పాలుగా మారిపోయాయి. అతనిలోని అమృత హృదయానికి రెండు చేతులతో నమస్కరించింది. "కళ్యాణీ! ఇతర వ్యాధుల వల్ల వచ్చే అనారోగ్యంలాంటిదే నీకొచ్చిన ఈ అనారోగ్యం కూడా అని నువ్వు భావించాలి, అన్ని భయాలూ వదలి ప్రశాంతంగా ఉండాలి, అదే నాకు కావలసింది" అంటూ ఆమెను అక్కున చేర్చుకున్నాడు.